సాక్షి అనంతపురం

శుక్రవారం ၊ 4 ၊ ఏప్రిల్ ၊ 2025



టన్ను చీనీ రూ.26,890

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26,890 పలికాయి.



స్నాతకోత్సవానికి ఆహ్వానం

త్వరలో జరగనున్న జేఎన్‌టీయూ 14వ స్నాతకోత్సవానికి వర్సిటీ చాన్స్‌లర్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను వీసీ సుదర్శనరావు గురువారం రాజ్‌భవన్‌కు వెళ్లి ఆహ్వానించారు.

గరిష్ఠం/కనిష్ఠం 38.3°/22.1°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. సాయంత్రం పలుచోట్ల వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేటి నుంచి స్లాట్ బుకింగ్ విధానం

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల్లో శుక్రవారం నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. www.igrs.ap.gov వెబ్ సైట్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు స్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. కావాల్సిన తేదీ, సమయాల్లో ముందుగానే స్లాట్ బుక్ చేసుకొని కార్యాలయానికి వెళ్తే కేవలం 20 నిమిషాల వ్యవధిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చన్నారు. ఆఫ్‌లైన్‌లో సైతం రిజిస్ట్రేషన్లు జరుగుతాయని, స్థిరాస్తి కొనుగోలు, అమ్మకందార్లు గమనించాలని ఆయన సూచించారు.

కించపరిచే పోస్టులు పెడితే కఠిన చర్యలు



ఎస్పీ జగదీష్

అనంతపురం: సామాజిక మాధ్యమాల్లో ఏ సామాజిక వర్గాన్నైనా కించపరిచే పోస్టులు పెడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ పి. జగదీష్ హెచ్చరించారు. కులాల మధ్య విద్వేషాలు సృష్టించే విధంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం, ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా పోస్టులు పెట్టే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, యూట్యూబ్, ఎక్స్ (ట్విట్టర్) తదితర సామాజిక మాధ్యమాల్లో అవమానకర రీతిలో పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా వివాదాస్పద విషయాలు, తప్పు దారి పట్టించే ఫేక్ న్యూస్ పెట్టినా, షేర్ చేసినా చట్టరీత్యా నేరమన్నారు. సంబంధిత గ్రూప్ అడ్మిన్‌ను బాధ్యుల్ని చేస్తూ కేసులు నమోదు చేస్తామన్నారు.

ఆసియా పారా త్రోబాల్ పోటీల్లో సత్తా



వెన్నపూస రోషి రెడ్డి

అనంతపురం: కంబోడియా దేశంలో గత నెల 28 నుంచి 30 వరకు నిర్వహించిన తొలి ఆసియా పారా త్రోబాల్ పోటీల్లో జిల్లాకు చెందిన యువకుడు సత్తా చాటాడు. దేశం తరఫున ప్రాతినిధ్యం వహించిన వెన్నపూస రోషి రెడ్డి ఏకంగా రజత పతకాన్ని సాధించాడు. ఈ మేరకు త్రో బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఆల్బర్ట్ ప్రేమ్ కుమార్ తెలిపారు. కంబోడియా మొదటి స్థానం, శ్రీలంక రెండో స్థానం, భారతదేశం మూడో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెన్నపూస రోషిరెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి.

రైతులందరికీ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

పుట్లూరు: రైతులందరికీ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ అన్నారు. గురువారం ఆమె మండలంలోని పుట్లూరు, కడవకల్లు, కోమటికుంట్ల రైతు సేవా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేయించుకుని విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ చెంగల రాయుడు, ఏఓ కాత్యాయని, ఏఈఓ హరి, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యం.. అధ్వానం

కూటమి ప్రభుత్వంలో వైద్య రంగం నిర్వీర్యమైంది. నాణ్యమైన వైద్యం దేవుడికెరుక... కనీసం మౌలిక సదుపాయాలు లేక రోగులు విలవిల్లాడిపోతున్నారు. మందుల కొరత వేధిస్తోంది. రక్త పరీక్షలు పూర్తి స్థాయిలో జరగడం లేదు. పదుల సంఖ్యలో పోస్టులు భర్తీకి నోచుకోలేదు. ఇదే అదునుగా పేదల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ఆసుపత్రులు వైద్య పరీక్షల పేరుతో జేబులు గుల్ల చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా సత్యకుమార్ ఉన్నా.. దుస్థితి నెలకొనడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



సర్వజనాస్పత్రి ఆర్థో ఓపీ ఎదుట డాక్టర్ల కోసం రోగుల పడిగాపులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమస్యల తిష్ట

సాక్షి నెట్‌వర్క్

- భర్తీ కాని వైద్యులు, సిబ్బంది పోస్టులు
- వేధిస్తున్న మందుల కొరత
- సౌకర్యాల కల్పనపై కూటమి సర్కారు నిర్లక్ష్యం
- ఉమ్మడి జిల్లా నుంచి వైద్యారోగ్య శాఖ మంత్రి ఉన్నా ప్రయోజనం శూన్యం

అనంతపురం హాస్పిటల్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమస్యలు తిష్ట వేశాయి. ఉమ్మడి జిల్లా ప్రజలకు పెద్ద దిక్కైన అనంతపురం సర్వజనాస్పత్రిలో అయితే, సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పదుల సంఖ్యలో ప్రొఫెసర్, అసోసియేట్,అసిస్టెంట్ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు.కొందరు వైద్యులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఓపీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండకుండా పీజీలపై భారం వేసి వెళ్లిపోతున్నారు. ఇటీవల ఏకంగా డెంటల్ ఓపీకి తాళాలు వేసేశారు.

- ఆస్పత్రిలో సిబ్బంది యథేచ్ఛగా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇటీవల కళ్యాణదుర్గానికి చెందిన శ్రీకాంత్ తమ బంధువు ఒకరికి అనారోగ్యంగా ఉంటే జీజీహెచ్‌కు తీసుకురాగా, రోగిని తరలించడానికి క్యాజువాలిటీలో ఉన్న ఓ ఎంఎన్‌ఓ వంద కొట్టాల్సిందేనన్నాడు. చేసేది లేక రూ.50 ఇచ్చినట్లు శ్రీకాంత్ తెలిపాడు.
- కొన్ని రోజుల క్రితం వజ్రకరూరుకు చెందిన శ్రీలక్ష్మి రెండో కాన్పు కోసం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చింది. ప్రసవం అయ్యాక ఆడబిడ్డ అని తెలియగానే అక్కడి క్లాస్–4 సిబ్బంది రూ.500 డిమాండ్ చేశారు. శ్రీలక్ష్మి మొదట రూ.వంద ఇవ్వగా.. 'మేం నలుగురున్నాం, వంద సరిపోదు' అంటూ వాదించడంతో చివరకు రూ.400 ఇవ్వాల్సి వచ్చింది. ఆస్పత్రిలో మెడిసిన్, సర్జరీ, ఆర్థో, పీడియాట్రిక్, గైనిక్, లేబర్, పల్మనాలజీ తదితర వార్డుల్లోనూ కొందరు ఎంఎన్‌ఓలు, ఎఫ్‌ఎన్‌లు, క్లాస్–4 సిబ్బంది అందినకాటికి దోచేస్తున్నట్లు తెలిసింది.
- ఆస్పత్రిలో రక్తపరీక్షలు పూర్తి స్థాయిలో జరగడం లేదు. బయోకెమెస్ట్రీకి సంబంధించి రీ ఏజెంట్ లేకపోవడంతో థైరాయిడ్ ప్రొఫైల్, లిపిడ్ ప్రొఫైల్ ఆగిపోయింది. ప్రైవేట్‌గా థైరాయిడ్ పరీక్ష రూ.600, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షను రూ.150 ఇచ్చి చేయించుకోవాల్సి వస్తోంది.

- పెద్దాస్పత్రిలో మందుల కొరత వేధిస్తోంది. కాన్పు కోసం ఇటీవల దివ్య అనే గర్భిణి ఆస్పత్రిలో అడ్మిట్ కాగా, వైద్యులు కొన్ని మందులు రాసిచ్చారు. అయితే, ఆ మందులు ఆస్పత్రిలో లేకపోవడంతో ప్రైవేట్ మెడికల్ స్టోర్‌లో దివ్య రూ.430 వెచ్చించి కొనుగోలు చేసింది. ఆస్పత్రిలోని గైనిక్, లేబర్, మెడిసిన్, ఐసీసీయూ, ఎమర్జెన్సీ, ఏఎంసీ, ఆర్థో తదితర వార్డుల్లో అమాక్సిక్లేవ్, సెఫిగ్జిమ్, పారాసిటమాల్, సెట్రిజిన్, మెట్‌ఫార్మిన్, సెఫోపెరాజాన్, పాంటాప్రజోల్ తదితర మాత్రలతో పాటు ఐవీ ఇంజెక్షన్లు లేవు.



సర్వజనాస్పత్రిలో రోజూ ఓపీ	2,200 నుంచి 2,500
ఐపీ	1,100 నుంచి 1,300
అందుబాటులో లేని మందుల సంఖ్య	30 నుంచి 50

ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులు

ప్రొఫెసర్లు	14
అసోసియేట్ ప్రొఫెసర్లు	15
అసిస్టెంట్ ప్రొఫెసర్లు	45
ట్యూటర్లు	44
సీనియర్ రెసిడెంట్స్	81

గుంతకల్లు ఆస్పత్రి.. మైనర్ ఆపరేషన్లతో సరి..

- రోజు ఓపీ: 600–700

గుంతకల్లు పట్టణంలోని శ్రీరాయ్‌సాహెబ్ మిడతల హంపయ్య ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. నాలుగు సివిల్ సర్జన్ (జనరల్, పీడియాట్రీషన్, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్, రేడియాలజిస్ట్)లతో పాటు స్టాఫ్ నర్సు పోస్టులు 10 ఖాళీ ఉన్నాయి. ఫార్మసీ సూపర్ వైజర్,గ్రేడ్–1 ఫార్మసిస్ట్,డార్క్‌రూమ్ అసిస్టెంట్–2, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్–1, అలాగే పరిపాలనా విభాగంలో పలు పోస్టులు ఖాళీలున్నాయి. సివిల్ సర్జన్‌ల కొరత కారణంగా సిజేరియన్, మైనర్ ఆపరేషన్లు తప్ప పెద్ద ఆపరేషన్లు జరగడం లేదు. బ్లడ్ బ్యాంక్‌లో కూడా స్టాఫ్ నర్సు–1, టెక్నీషియన్లు–3, కౌన్సిలర్–1 ఖాళీలున్నాయి. మందుల కొరత కూడా ప్రధాన సమస్యగా మారింది. చర్మ రోగాలకు సంబంధించి (ఫ్లూకొనజోల్, ఇట్రాకొనజోల్), హెర్పిస్ వైరస్ ఇన్‌ఫెక్షన్‌లకు ఇచ్చే (వసిక్లోవిర్), నొప్పులకు సంబంధించి (ట్రిమడాల్), గజ్జి, పగుళ్లకు సంబంధించిన మందులు, ఆయింట్‌మెంట్, ముక్కులో వేసుకునే డ్రాప్స్‌ను కూడా ప్రభుత్వం సరిగా సరఫరా చేయడం లేదు. అంతేకాకుండా ఆస్పత్రిలో వైద్యులు, నర్సులు, సిబ్బందికి అవసరమైన సర్జికల్ గ్లౌవ్స్‌ను కూడా సక్రమంగా సరఫరా చేయకపోవడంతో బయటి నుంచి తెప్పించుకుంటున్నారు.

పరీక్షలు జరగవు.. మాత్రలు ఉండవు..

- శింగనమల పీహెచ్‌సీ
- నిత్యం ఓపీ: 250

శింగనమల: శింగనమల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డిప్యూటీ సర్జన్ పోస్టు ఖాళీగా ఉంది. గతంలో ప్రతి వారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేవారు. ప్రస్తుతం వారానికి నలుగురికి మాత్రమే చేస్తున్నారు. సీహెచ్‌సీలో స్టాఫ్ నర్సు పోస్టు ఖాళీగా ఉంది. సుఖ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు జరగడం లేదు. సీహెచ్‌సీలో పాంటాప్ మాత్ర లేకపోవడంతో, ప్రత్యామ్నాయంగా వేరే మాత్రలు ఇస్తున్నారు.

పేరుకే వంద పడకల ఆస్పత్రి

- రాయదుర్గం ఏరియా ఆస్పత్రి
- నిత్యం ఓపీ: 200–230



రాయదుర్గంలో అర్ధంతరంగా ఆగిన ఆస్పత్రి నిర్మాణ పనులు

రాయదుర్గం: రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో పేరుకే వంద పడకలు కానీ, రోగులు మాత్రం 40 బెడ్లతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీహెచ్‌సీని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. నూతన ఆస్పత్రి భవన నిర్మాణం కోసం రూ.17 కోట్లు మంజూరు చేశారు. ఎన్నికలకు ముందు ఈ పనులు 80 శాతం పూర్తయ్యాయి. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చాక గాలికొదిలేశారు. దీంతో రోగులకు బెడ్లు సరిపడక నేలపైనా, ఒక్కో బెడ్డుపై ఇద్దరు లేదా ముగ్గురిని ఉంచి వైద్యం చేయాల్సి వస్తోంది. ఇక ఆస్పత్రిలో 23 మంది వైద్యులు ఉండాల్సి ఉన్నా ప్రస్తుతం 12 మందే ఉన్నారు. నర్సింగ్, ఇతర విభాగాల్లోనూ 73 మందికి గాను 23 మంది మాత్రమే విధుల్లో ఉంటున్నారు. ఆస్పత్రిలో మత్తు, ఇతర మందులు అందుబాటులో లేవు. తాగునీటి కొరత వేధిస్తోంది. వీల్‌ఛైర్లు, స్ట్రెచర్లు సరిపడా లేవు. దీంతో రోగులు విధిలేక బళ్లారి విమ్స్‌కు వెళుతున్నారు.

- కణేకల్లు సీహెచ్‌సీలో డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సమయపాలన పాటించడం లేదు. ఓపీ 9 గంటలకు ప్రారంభించాల్సి ఉన్నా డాక్టర్లు మాత్రం 11 గంటల వరకు డ్యూటీలకు రావడం లేదు. 10 గంటలపైనే డాక్టర్లు ఆస్పత్రికి వస్తుండటం గమనార్హం.

'దుర్గం'లో.. జబ్బు చేస్తే ప్రైవేట్‌కే

- ఆస్పత్రి: కళ్యాణదుర్గం సీహెచ్‌సీ
- రోజు ఓపీ: సుమారు 800

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ల కొరత పట్టి పీడిస్తోంది. మొత్తం 9 మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా కీలకమైన పీడియాట్రిక్ (చిన్నపిల్లల వైద్యుడు), జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చిన్నపిల్లల వైద్యుడు లేకపోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆర్డీటీ ఆసుపత్రి, ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆసుపత్రిలో డెంటిస్ట్ మూడు రోజుల పాటు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. దీంతో పంటి నొప్పులతో వెళ్లే వారికి సైతం సరైన వైద్యం అందడం లేదు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాల్సిన శానిటేషన్ సిబ్బంది కొరత ఉంది. 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పూర్తి స్థాయిలో స్పెషల్ అసిస్టెంట్లు

- ఊపిరి పీల్చుకున్న విద్యాశాఖ అధికారులు
- ఆలస్యంగా ప్రారంభమైన టెన్త్ 'స్పాట్'



డీఈఓ, ప్రభుత్వ పరీక్షల ఏసీతో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి మూల్యాంకనం విధులకు స్పెషల్ అసిస్టెంట్లు పూర్తిస్థాయిలో వచ్చారు. 200లోపు అవసరం కాగా... 220 మంది ఉపాధ్యాయులు ఆసక్తి చూపుతూ విధుల్లో చేరడంతో విద్యాశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో గురువారం పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. ఉదయం 9 గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఏఈలుగా నియమించిన పలువురు టీచర్లు వివిధ కారణాలతో ఉత్తర్వులు రద్దు చేసుకునేందుకు తంటాలు పడ్డారు. అలాగే విధుల్లో చేరేందుకు చాలామంది టీచర్లు ఆసక్తి చూపించారు. అన్నింటినీ సర్దుబాటు చేసిన అధికారులు ఎట్టకేలకు మధ్యాహ్నం భోజనం అనంతరం మూల్యాంకనం ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సరిపడా ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. చల్లని తాగునీటి వసతి కల్పించారు. తొలిరోజు ఒక్కొక్కరికి 15–20 పేపర్లు ఇచ్చారు. రెండోరోజు నుంచి ఉదయం 20, మధ్యాహ్నం 20 పేపర్లు ఇస్తామని అధికారులు చెబుతున్నారు. క్యాంపు ఆఫీసరు, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్ (స్ట్రాంగ్‌రూం) గోవిందనాయక్, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్ (అడ్మినిస్ట్రేషన్) శ్రీనివాసరావు పర్యవేక్షించారు. పేపర్లు మూల్యాంకనం చేసే అసిస్టెంట్ ఎగ్జామినర్లు (ఏఈ) ఇంగ్లిష్‌కు 150 మంది, తెలుగు 140, హిందీ 120, ఫిజికల్ సైన్స్ 120, బయాలజికల్ సైన్స్ 100, సోషల్ 120 మందిని నియమించారు.

జాగ్రత్తగా దిద్దండి...

పరీక్షలు బాగా రాసిన ఏ ఒక్క విద్యార్థికీ మార్కుల నమోదులో అన్యాయం జరగకూడదని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు స్పష్టం చేశారు. జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు పరిశీలించి మార్కులు వేయాలన్నారు. వేసిన మార్కుల టోటలింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థుల జీవితాలతో ముడిపడిన మూల్యాంకన విషయంలో ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దని ఆదేశించారు. విధుల్లో పాల్గొనే టీచర్లకు అన్ని వసతులు ఏర్పాటు చేశామని, ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని డీఈఓ కోరారు.

మైసూరు-అజ్మీర్‌కు సమ్మర్ స్పెషల్ రైలు

- రాయదుర్గం మీదుగా రాకపోకలు



రాయదుర్గంటౌన్: రాయదుర్గం మీదుగా మైసూరు నుంచి అజ్మీర్‌కు సమ్మర్ స్పెషల్ రైలు సర్వీసు నడుస్తున్నట్లు సౌత్ వెస్ట్రన్ రైల్వే హుబ్లీ డివిజన్ చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మంజునాథ కనమడి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మైసూరు–అజ్మీర్ (06281) రైలు ఏప్రిల్ 5,12,19,26 తేదీల్లో, మే 3,10,17,24 తేదీల్లో, జూన్ 7, 14 తేదీల్లో ప్రతి శనివారం (మొత్తం 11 సర్వీసులు) నడుస్తుందన్నారు. మైసూరులో ఉదయం 8 గంటలకు బయలు దేరి హాసన్, అర్సికెరె, చిత్రదుర్గం, రాయదుర్గం, బళ్లారి కంటోన్మెంట్, హుబ్లీ, కళ్యాణ్, వడోదర మీదుగా సోమవారం ఉదయం 6.55 గంటలకు అజ్మీర్ చేరుకుంటుందన్నారు. అలాగే తిరుగు ప్రయాణంలో (06282) ఏప్రిల్ 7,14,21,28 తేదీల్లో, మే 5, 12, 19,26 తేదీల్లో, జూన్ 2,9,16 తేదీల్లో ప్రతి సోమవారం (11 సర్వీసులు) సాయంత్రం 6.50 గంటలకు బయలుదేరి బుధవారం సాయంత్రం 5.30 గంటలకు మైసూరు చేరుకుంటుందని తెలిపారు. ఇప్పటికే రిజర్వేషన్ సౌకర్యం ప్రారంభమైందని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దంచి కొట్టిన వాన

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా గురువారం సాయంత్రం పలు మండలాల్లో అకాల వర్షం కురిసింది. 20 నుంచి 30 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. ఉరుములు, మెరుపులు దడ పుట్టించాయి. అనంతపురంలో గంట పాటు గాలితో కూడిన వాన పడింది. శింగనమల, పుట్లూరు, గార్లదిన్నె, యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో 30 మి.మీ నుంచి 40 మి.మీ వర్షపాతం నమోదైంది. బుక్కరాయసముద్రం, యల్లనూరు, పామిడి, తాడిపత్రి, రాప్తాడులో 10 మి.మీ నుంచి 20 మి.మీ వర్షం కురిసింది. కుందుర్పి, వజ్రకరూరు, విడపనకల్లు, కళ్యాణదుర్గం, కూడేరుతో పాటు మరికొన్ని మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. అక్కడక్కడా ఈదురుగాలులకు పంట నష్టం జరిగినట్లు సమాచారం. గాలులకు చెట్లు పడిపోవడంతో చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



అనంతపురం రామ్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద నిలిచిన వర్షపు నీరు

'ఉపాధి' లక్ష్యం 1.20 కోట్ల పనిదినాలు

- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద 1.20 కోట్ల పనిదినాలు కల్పించాలని లక్ష్యం నిర్దేశించుకున్నాం. గత ఆర్థిక సంవత్సరంలో 2.12 లక్షల కుటుంబాలకు రూ.287.01 కోట్లు వేతన రూపంలో చెల్లించాం' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ వెల్లడించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డ్వామా పీడీ సలీమ్‌బాషా, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాంతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉపాధి హామీ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. కూలీలకు ఉపాధి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కింద నీటి నిల్వ, సంరక్షణ పనుల్లో భాగంగా 238 చెరువుల్లో పూడిక తీత, 575 సేద్యపు నీటి కుంటలు, 1,276 కొండల్లో నీటి నిల్వ కందకాలు, 2,347 డిగ్ అవుట్ పాండ్లు, 374 పంట కాలవల్లో పూడికతీత చేపట్టామన్నారు. అలాగే, రూ.73.86 కోట్లతో 194.57 కిలోమీటర్ల సీసీ రోడ్లు, రూ.4.85 కోట్లతో 10.39 కిలోమీటర్ల బీటీ రోడ్లు, రూ.93.60 లక్షలతో 7.25 కిలోమీటర్ల సీసీ కాలువలు, రూ.29.16 కోట్లతో 1,437 పశువుల షెడ్ల నిర్మాణ పనులు జరిగాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.20 కోట్ల పని దినాలు కల్పించి కూలీలకు రూ.375 కోట్లు వేతన రూపంలో చెల్లించాలని లక్ష్యం నిర్దేశించుకున్నామన్నారు. మొదటి త్రైమాసికంలో భాగంగా ఈ నెలలో 24.62 లక్షల పని దినాలు, మేలో 32.59 లక్షలు, జూన్‌లో 10.79 లక్షల పనిదినాలు మొత్తం 68 లక్షలు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. అదే విధంగా 8 వేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టనున్నామన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండు రోజుల పాటు జిల్లాలో బలమైన గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

క్లుప్తంగా

పోలీస్ శాఖకు రూ.కోటి విలువైన ఉపకరణాల వితరణ



కంపెనీలు అందజేసిన పరికరాలతో ఎస్పీ పి. జగదీష్

అనంతపురం: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద జిల్లా పోలీసు శాఖకు రూ.కోటి విలువ చేసే డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలు, సోలార్ లైట్లు, బాడీవోర్న్ కెమెరాలు, ఎల్ఈడీ డిస్ప్లేలు, మహీంద్రా బొలేరో వాహనాలను ఆయా కంపెనీ ప్రతినిధులు అందజేశారు. ఇందులో తాడిపత్రి అల్ట్రాటెక్ కంపెనీ రూ.10.05 లక్షల విలువ చేసే 50 సోలార్ లైట్లు, మొబీస్ ఇండియా మాడ్యుల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు రూ.33 లక్షల విలువ చేసే 300 అత్యాధునిక సోలార్ బేస్డ్ కెమెరాలు, అర్జాస్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రూ.18.17 లక్షల విలువ చేసే 10 డ్రోన్ కెమెరాలు, సప్తగిరి క్యాంపర్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రూ.5 లక్షల విలువ చేసే రెండు డ్రోన్, 7 బాడీవోర్న్ కెమెరాలు , జిందాల్ స్టీల్ కంపెనీ వారు రూ.10 లక్షల విలువ చేసే 6 డ్రోన్ కెమెరాలు, అదానీ ఫౌండేషన్ (తాడిపత్రి) వారు రూ.19 లక్షల విలువ చేసే ఎల్ఈడీ డిస్ప్లేలు, మహీంద్ర బొలేరో వాహనాన్ని ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులను ఎస్పీ పి. జగదీష్ సత్కరించారు.

13 తులాల బంగారం మాయం

తాడిపత్రి టౌన్(యాడికి): ఇంట్లోని బీరువాలో దాచిన 13 తులాల బంగారు నగలు కనిపించడం లేదంటూ గురువారం ఉదయం పోలీసులకు యాడికి మండలం పెద్దపేట గ్రామానికి చెందిన సంజీవరాయుడు ఫిర్యాదు చేశాడు. గత నెలలో యాడికిలో జరిగిన చెన్నకేశవ బ్రహ్మోత్సవాలకు కుటుంబసభ్యులతో కలసి సంజీవరాయుడు వెళ్లాడు. ఆ సమయంలో ఇంటి తాళం ఆరుబయట ఉన్న బాత్రూమ్‌లో దాచి వెళ్లారు. ఉత్సవాల నుంచి తిరిగి ఇంటికి చేరుకున్న తర్వాత వేసిన తలుపులు వేసినట్లుగానే ఉండడంతో ఎలాంటి అనుమానాలు రాలేదు. గురువారం బంగారు నగలు అవసరం కావడంతో బీరువా తెరిచి చూడగా కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఇరువర్గాలపై కేసులు నమోదు

బొమ్మనహాళ్: మండలంలోని కృష్ణాపురంలో బొమ్మ–బొరుసు ఆట ఆడుతూ రూ. వెయ్యి కోసం ఇద్దరు వ్యక్తుల మధ్య చోటు చేసుకున్న చిన్నపాటి గొడవ ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ఇరువర్గాలకు చెందిన మొత్తం 18 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. ఒక వర్గానికి చెందిన ఈశ్వరరెడ్డి, గంగిరెడ్డి, నరేష్, హనుమంతరెడ్డి, యోగానందరెడ్డి, చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, బ్రహ్మయ్య మరో వర్గానికి చెందిన పెద్ద తిప్పయ్య, చిన్న తిప్పయ్య, వన్నూరుస్వామి, ప్రభాకర్, సుధాకర్, లింగప్ప, తిమ్మరాజు, ప్రసాద్, తిప్పక్కపై కేసులు నమోదు చేసి, నిందితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. మరోసారి గొడవలకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేయాల్సి ఉంటుందని ఇరువర్గాలను హెచ్చరించినట్లు పేర్కొన్నారు.

దళారుల మాటే చెల్లుబాటు!

- రాయదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దందా
- లంచమిస్తేనే రిజిస్ట్రేషన్
- దస్తావేజు లేఖరులే సూత్రధారులు
- రోజూ చేతులు మారుతున్న రూ.లక్షలు

- రాయదుర్గంలోని భంభంస్వామి, అనంతపురం, బీటీపీ, కణేకల్లు, బళ్లారి రహదారుల పక్కనే కొన్ని వెంచర్లు వెలిశాయి. వీటిలో చాలా వరకూ వెంచర్లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి. అగ్రికల్చర్ నుంచి నాన్ అగ్రికల్చర్ కింద మార్పు చేయలేదు. అయినా రిజిస్ట్రేషన్లు మాత్రం ఇబ్బడి ముబ్బడిగా జరిగిపోతున్నాయి.
- రాయదుర్గంలోని శాంతినగర్‌లో విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జాచేశాడు. దీనికి దొంగ పట్టా సృష్టించి, దాని ఆధారంగా తన పేరుపై ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి.

... ఇలా ఈ రెండే కాదు జరిగిన ప్రతి రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వ చలానా కంటే అదనంగా వసూళ్లు చేసినట్టు తెలుస్తోంది. అక్రమార్జనే ధ్యేయంగా రిజిస్ట్రేషన్ కార్యాలయ అధికారులు పనిచేస్తుండడంతో ఆరోపణలు వెల్లువెత్తాయి.



రాయదుర్గంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రాయదుర్గం: జిల్లాలోని కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దళారుల దందా సాగుతోంది. ఒక్కో పనికి ఒక్కో రేటు కట్టి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. కార్యాలయంలో ఏ చిన్న పనికైనా బ్రోకర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. పత్రాలన్నీ సక్రమంగా ఉన్నా .. ఎంతో కొంత ముట్టచెబితేనే పని పూర్తవుతుంది. కొందరు దస్తావేజు లేఖరులు వసూళ్ల రాయుళ్లుగా అవతారమెత్తి అక్రమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అధికారుల వాటా కలుపుకునే డాక్యుమెంట్ తయారీ ఖర్చుల కింద భారీగా వసూళ్లు చేస్తున్నారు. ఆస్తి విలువను బట్టి కనీసం రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకు అక్రమంగా వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం.

ఒక్కో పనికి ఒక్కో రేటు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించారు. ఈ వ్యవహారమంతా బహిరంగ రహస్యమే. కార్యాలయంలో రోజూ 20 నుంచి 30 రిజిస్ట్రేషన్లు, సీసీ (సర్టిఫైడ్ కాపీ)లు 20 నుంచి 30, ఈసీ (ఎంక్యూబరెన్స్ సర్టిఫికెట్) 30 నుంచి 40కుపైగా లావాదేవీలు జరుగుతున్నాయి. ఒక్కో డాక్యుమెంట్‌పై దాని విలువ, కోరుకున్న వారి అవసరాన్నిబట్టి రూ.20 వేల నుంచి రూ.లక్ష దాకా అదనపు సొమ్ము వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతి లేని లేఔట్లకు సైతం రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయి. వివాదాలు ఏమున్నా, ఆఖరకు రికార్డులు సక్రమంగా లేకున్నా.. సరే లంచం చెల్లిస్తే పని చక్కబెట్టేస్తుండడం గమనార్హం.

కీలకంగా మారిన నమ్మిన బంటు

అధికారికి చేర్చాల్సిన నగదును తన నమ్మినబంటుకు సాయంత్రం కాగానే పైసాతో సహా లెక్కించి దస్తావేజు లేఖరులు ముట్టజెపుతుంటారు. ఈ నగదును సమీప పెట్రోల్ బంకుల్లో మార్పిడి చేసి చివర్లో అధికారి వాహనం వద్దకు చేరుస్తున్నట్లు సమాచారం. స్టాంప్‌ల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రూ.50కు విక్రయించాల్సిన స్టాంపు రూ.250తో కొనుగోలు చేయాల్సి వస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.

అక్రమ వసూళ్లకు తెరలేపారు



“ రాయదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దళారులను సంప్రదిస్తేనే పనులు పూర్తవుతున్నాయి. ఏ పని కావాలన్నా ముందు వారిని కలిసే పద్ధతి అధికారులు తప్పనిసరి చేశారు. ఒక్కో బ్యాచీ ఒక్కో విధంగా అక్రమ వసూళ్లకు తెరలేపింది. క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్ ఏదైనా సరే వారి డాక్యుమెంట్‌తో వెళితేనే అధికారి ఆమోద ముద్ర వేస్తున్నారు. మాటతో కాకుండా పెన్సిల్‌రాత ఆధారంగా ధర నిర్ణయించి వసూళ్లకు తెరలేపారు.

– కొట్రేసి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు

సమగ్ర విచారణ జరపాలి



రాయదుర్గం రిజిస్ట్రార్ కార్యాలయంలో గత మూడు నెలలుగా జరిగిన ప్రతి రిజిస్ట్రేషన్‌పై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలి. అప్పుడే అవినీతి ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతుంది. ప్రభుత్వ చలానా ఎంత? రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారితో ఎంత వసూలు చేశారు? అనే కోణంలో విచారణ చేపడితే అసలు బాగోతం వెలుగు చూస్తుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల దందా అరికట్టాలి. ఉన్నతాధికారుల స్పందించకపోతే ఉద్యమాలకు సిద్ధపడుతాం.


– మల్లికార్జున, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు

దళారులను అనుమతించం

కార్యాలయంలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులను అనుమతించేది లేదు. లేఖరులైనా, ప్రైవేటు వ్యక్తులైనా డాక్యుమెంట్లకు అదనంగా వసూళ్లు చేస్తున్నట్టు మా దృష్టికి రాలేదు. అలాంటిది ఏదైనా ఉంటే ప్రత్యేక నిఘా ఉంచుతాం. ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు చేపడతాం. అక్రమాలకు తావులేకుండా రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నాం. చాలా తక్కువ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. స్టాంపుల కొరత లేకుండా చర్యలు చేపడతాం.

– శ్రీనివాసులు, సబ్‌రిజిస్ట్రార్, రాయదుర్గం

ప్రాణాలు బలిగొన్న ఈత సరదా



కుంట వద్ద పోగైన గ్రామస్తులు (ఇన్‌సెట్‌లో) హరినాథ్‌రెడ్డి (ఫైల్)


పెద్దవడుగూరు: మండలంలోని దిమ్మగుడి గ్రామానికి చెందిన హరినాథ్‌రెడ్డి (15) గురువారం ఈత కొట్టేందుకు వెళ్లి నీట మునిగి మృతి చెందాడు. తల్లిదండ్రులు వలస కూలీలు కావడంతో డ్రాపౌట్‌గా మారాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం తన స్నేహితులతో కలసి సి.రామరాజుపల్లి వద్ద ఉన్న నీటి కుంటలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. తనకు ఈత రాకున్నా.. ప్రయత్నిస్తూ లోతైన ప్రాంతానికి వెళ్లడంతో నీట మునిగిపోయాడు. సమాచారం అందుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకుని గజ ఈతగాళ్ల రంగంలో దించడంతో సుదీర్ఘ సమయం అనంతరం హరినాథ్‌రెడ్డి మృతదేహం బయటపడింది. హైదరాబాద్‌లో ఉంటున్న తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా గ్రామస్తులు సమాచారం అందించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

నీట మునిగి విద్యార్థి మృతి

కళ్యాణదుర్గం రూరల్: ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గంలోని వడ్డేబండ వీధికి చెందిన గోవిందప్ప, లలితమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునే వారు. వీరి రెండో కుమారుడు సంజయ్ (13) స్థానిక నార్త్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నాడు. గురువారం మధ్యాహ్నం స్నేహితులతో కలసి ఊరి చెరువులోకి ఈతకెళ్లిన సంజయ్.. కాసేపు సరదాగా నీటిలో ఆడుకుంటూ లోతైన ప్రాంతానికి వెళ్లడంతో నీట మునిగాడు. గమనించిన స్థానికులు వెంటనే సంజయ్‌ను వెలికి తీశారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకోవడంతో హుటాహుటిన స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పచ్చిరొట్ట విత్తన ధరల ఖరారు

- జిల్లాకు 207 క్వింటాళ్లు, శ్రీసత్యసాయి జిల్లాకు 138 క్వింటాళ్ల కేటాయింపు
- 50 శాతం రాయితీతో రైతులకు జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనం



జీలుగ విత్తనాలు

అనంతపురం అగ్రికల్చర్: పచ్చిరొట్ట (గ్రీన్ మెన్యూర్స్) విత్తన ధరలు ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఖరీఫ్‌లో రాయితీ విత్తన పంపిణీ ప్రక్రియలో భాగంగా ఏటా రైతులకు ఉపయోగపడే పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్న విషయం తెలిసిందే. పచ్చిరొట్ట విత్తనాల కింద జీలుగ (ధనించా), జనుము (సన్ హెంప్), పిల్లిపెసర ద్వారా భూసారం పెంచుకునేందుకు వీలుగా పొలాల్లో చల్లి పూతకు వచ్చిన తర్వాత కలియదున్నితే సేంద్రియ పదార్థం బాగా పెరుగుతుందని శాస్త్రీయంగా నిరూపితమైంది. దీంతో ఇటీవల ఈ విత్తనాలకు రైతుల నుంచి డిమాండ్ పెరగడంతో వీటి ధరలు, రాయితీలు ఖరారు చేశారు. జిల్లాకు ఈ ఏడాది 190 క్వింటాళ్ల జీలుగ, రెండు క్వింటాళ్ల జనుము, 15వ క్వింటాళ్ల పిల్లిపెసర... మొత్తం 207 క్వింటాళ్లు కేటాయించారు. రబీలో కూడా జనుము, జీలుగ విత్తనాలు 425 క్వింటాళ్లు కేటాయించారు. అటు శ్రీసత్యసాయి జిల్లాకు కూడా ఖరీఫ్‌లో 138 క్వింటాళ్లు ఇచ్చారు. వీటిని 50 శాతం సబ్సిడీతో రైతులకు ఇవ్వనున్నారు. ఏపీ సీడ్స్ ద్వారా వీటిని సరఫరా చేసి రైతులకు పంపిణీ చేయనున్నారు. జీలుగ విత్తనాలు క్వింటా పూర్తి ధర రూ.12,300 కాగా, 50 శాతం రాయితీతో రూ.6,150 చొప్పున రైతులకు అందజేయనున్నారు. అలాగే క్వింటా జనుము విత్తనాల పూర్తి ధర రూ.10,900 కాగా, 50 శాతం రాయితీ పోను రూ.5,450 చెల్లించాలి. పిల్లిపెసర క్వింటా పూర్తి ధర రూ.18 వేలు కాగా, 50 శాతం రాయితీ పోను రూ.9 వేల చొప్పున రైతులకు విక్రయిస్తారు. జీలుగు, జనుము విత్తనాలు 10 కిలోల ప్యాకెట్ల రూపంలో, పిల్లిపెసర 8 కిలోల ప్యాకెట్ కింద ఎకరాలోపు ఒక బ్యాగ్, రెండు ఎకరాలకు రెండు, మూడు ఎకరాలున్న రైతులకు మూడు బ్యాగులు, నాలుగు ఎకరాలున్న వారికి నాలుగు బ్యాగులు, ఐదు ఎకరాలు, అంతకన్నా ఎక్కువ ఉన్న వారికి గరిష్టంగా ఐదు బ్యాగులు పంపిణీ చేయనున్నారు. రైతు ఆసక్తిని బట్టి మూడు రకాల విత్తనాలు వేర్వేరుగానూ, మూడు రకాల విత్తనాలు కలిపి ఒకే బ్యాగ్ రూపంలోనూ ఇవ్వనున్నారు. మూడు కలిపిన వాటిలో నాలుగు కిలోల చొప్పున జీలుగ, జనుము, రెండు కిలోల పిల్లిపెసర ఉంటాయి. 10 కిలోలు కలిగిన మిక్సింగ్‌కిట్ పూర్తి ఖరీదు రూ.1,296 కాగా, 50 శాతం రాయితీ పోను రూ.648 చొప్పున రైతులు చెల్లించాల్సి ఉంటుంది. అవసరమైన రైతులు ఆర్ఎస్‌కేలలో తమ వాటా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పూర్తి చేయాలి : కలెక్టర్



అనంతపురం అర్బన్: పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ అంశంపై గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజతో కలసి విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. పాఠశాల యాజమాన్య కమిటీల ఆమోదంతో పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలన్నారు. స్థానిక శాసనసభ్యులతో మాట్లాడి ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్తులను ఒప్పించి సామరస్యంగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రీ ప్రైమరీ 1, 2 పిల్లలు కచ్చితంగా ప్రభుత్వ పాఠశాల్లోనే ఒకటవ తరగతి చేరేలా తల్లిదండ్రులను ఒప్పించి 100 శాతం ప్రవేశాలు జరిగేలా చూడాలన్నారు.

పీజీ ప్రవేశాలకు వేళాయె



ఎస్కేయూ ప్రధాన ద్వారం

అనంతపురం: పీజీ ప్రవేశాలకు సన్నాహాలు మొదలయ్యాయి. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్ష (పీజీ సెట్)కు నోటిఫికేషన్ విడుదలైంది. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మార్కుల ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 17 వర్సిటీలు, వాటి అనుబంధ పీజీ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. తాజాగా ఏపీ పీజీసెట్ నిర్వహణ బాధ్యతలను తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీకి అప్పగించారు. httpr://cets.apche.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ సెట్‌కు అర్హత వివరాలు..

డిగ్రీ ఉత్తీర్ణులైన ఓసీ, బీసీ కేటగిరి విద్యార్థులకు 50 శాతం , ఎస్సీ, ఎస్టీ కేటగిరి విద్యార్థులకు 45 శాతం మార్కులు వచ్చి ఉండాలి. ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఉంటుంది. మొత్తం 100 ప్రశ్నలకు వంద మార్కులు ఉంటాయి. 90 నిమిషాల సమయం ఇస్తారు. నెగిటివ్ మార్కులు ఉండవు. వర్సిటీ క్యాంపస్ కళాశాలల్లో ఉన్న కోర్సులను మూడు కేటగిరీలుగా విభజించి ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తుకు తుది గడువు ఏప్రిల్ 13. జూన్ 9 నుంచి 13వ తేదీ వరకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు.

ఎస్కేయూలో ప్రవేశాలు..

అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ పీజీ కోర్సుల్లో పీజీ సెట్ ద్వారా అడ్మిషన్లు కల్పిస్తారు. ఎస్కేయూ క్యాంపస్ కళాశాలల్లో ఆర్ట్స్ బ్రాంచ్‌లు 13 ఉన్నాయి. ఇందులో లా కోర్సులు లాసెట్ ద్వారా, ఎంబీఏ కోర్సులు ఐసెట్ ద్వారా భర్తీ చేస్తారు. తక్కిన 11 కోర్సులు పీజీ సెట్ ద్వారా భర్తీ అవుతాయి. సైన్సెస్‌లో 15 బ్రాంచులు ఉన్నాయి. ఎంపీఈడీ ప్రత్యేక సెట్ ద్వారా భర్తీ చేస్తారు. ఎస్కేయూ పరిధిలో 19 అనుబంధ పీజీ కళాశాలలు ఉన్నాయి. పీజీసెట్‌లో ర్యాంకులను బట్టి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

పిడుగుపాటుకు వివాహిత మృతి



ఇంద్రజ (ఫైల్)

గుంతకల్లు రూరల్: పిడుగుపాటుకు ఓ వివాహిత మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం కదిరిపల్లికి చెందిన సుంకన్న, రమాదేవి దంపతుల కుమారుడు రమణకు రెండేళ్ల క్రితం పెద్దవప్పూరు మండలానికి చెందిన ఇంద్రజ (24)తో వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న కుమార్తె ఉంది. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో బోరు బావి కింద సాగు చేసిన వేరుశనగ పంట చేతికి వచ్చింది. శుక్రవారం పంటను తొలగించాలనుకున్న దంపతులు గురువారం సాయంత్రం పొలానికి వెళ్లి స్ప్రింక్లర్ల సాయంతో నీళ్లు పెడుతుండగా జడి వాన మొదలైంది. కాసేపటికి ఉరుములు, మెరుపులు ఎక్కువ కావడంతో పని ఆపి ఇంటికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. రమణ బోరు బావి వద్దకెళ్లి కాలికి అంటుకున్న బురదను కడుక్కుంటుండగా, నాలుగు అడుగుల దూరంలోనే భర్త కోసం వేచి చూస్తున్న ఇంద్రజపై పిడుగు రాలింది. ఆమె శరీరంలో నుంచి నేరుగా దూసుకెళ్లి భూమిని తాకడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. గుండె కింద భాగంలో బొక్క పడి శరీరంలో రెండు చీలికలు ఏర్పడ్డాయి. కాలి పట్టీలు తెగిపడ్డాయి. శరీరం మొత్తం నల్లగా మాడిపోయింది. విషయాన్ని గమనించిన భర్త ఒక్కసారిగా నిర్ఘాంతపోయాడు. దాదాపు అరగంట తర్వాత తేరుకున్న ఆయన వెళ్లి విగతజీవిగా ఉన్న పడి ఉన్న భార్యను చూసి బోరున విలపించాడు. సమాచారం అందుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకుని ఇంద్రజ మృతదేహాన్ని ఇంటికి తరలించారు.విషయం తెలుసుకున్న తహసీల్దార్ రమాదేవి... గ్రామానికి చేరుకుని ఇంద్రజ మృతదేహాన్ని పరిశీలించి, నివేదిక సిద్ధం చేశారు.

అయ్యో.. పాపం!



పాకుతూ వెళ్తున్న రత్నమ్మ

గుంతకల్లు: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మౌలిక వసతులు లేక ఓ దివ్యాంగురాలు గురువారం ఇలా నేల మీద పాకుతూ వైద్య పరీక్షలకు హాజరు కావాల్సి వచ్చింది. వివరాలు.. గుంతకల్లులోని సత్యనారాయణ పేటకు చెందిన రత్నమ్మకు 64 ఏళ్లు. పోలియో వల్ల చిరుప్రాయంలోనే కాళ్లు చచ్చుపడ్డాయి. దీంతో ఇల్లు విడిచి ఎక్కువగా బయటకు రాదు. గత ప్రభుత్వంలో ఇంటి వద్దనే వలంటీర్ల ద్వారా ఆమె దివ్యాంగుల పింఛన్ అందుకుంటూ వచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రీ వెరిఫికేషన్ కష్టాలు వెన్నాడడంతో తప్పని పరిస్థితుల్లో గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రికి వచ్చింది. ఆటో నుంచి దిగిన అనంతరం వీల్‌చైర్ కోసం సహాయకురాలి ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో నేలపై పాకుతూ వెళుతుంటే గమనించిన ప్రజలు ఆస్పత్రిలో వైద్య సేవలపై విమర్శలు గుప్పించారు. ఇది కాస్త మెడికల్ ఆఫీసర్ చెవిన పడడంతో వెంటనే ఆయన ఆమె వద్దకు చేరుకుని వైకల్య ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అంగవైకల్యంతో బాధపడుతూ ప్రతి గురువారం సదరం సర్టిఫికెట్ వచ్చే దివ్యాంగులందరూ రత్నమ్మ మాదిరే అష్ట కష్టాలు పడాల్సి వస్తుండడం గమనార్హం.

యువకుడి దుర్మరణం

పామిడి/గార్లదిన్నె: స్థానిక 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడి మండలం వంకరాజుకాలువ గ్రామానికి చెందిన బోయ చిన్న చౌడప్ప(38)కు భార్య సులోచన, ఓ కుమారుడు ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునే వాడు. గురువారం ఉదయం 9.30 గంటలకు అత్యవసర పని ఏర్పడడంతో ద్విచక్ర వాహనంపై అనంతపురానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో గార్లదిన్నె మండల పరిధిలో 44వ జాతీయ రహదారిపై కనుంపల్లి క్రాస్ వద్దకు చేరుకోగానే కారును ఓవర్ టేక్ చేస్తుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న గార్లదిన్నె పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పామిడి సీహెచ్‌సీకి తరలించి, కేసు నమోదు చేశారు.

విద్యార్థిని బలవన్మరణం



మృతురాలు గౌతమి

పామిడి: ఉత్తీర్ణతపై ఆందోళన చెంది ఓ సీనియర్ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... పామిడి గ్రామంలోని బీసీ కాలనీలో నివాసముంటున్న ఉప్పర నారాయణ, మస్తానమ్మ దంపతుల కుమార్తె గౌతమి (17) తిరుపతిలోని చంద్రగిరి ప్రభుత్వకళాశాలలో ఒకేషనల్ కోర్సులో చేరింది. ఇటీవల ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి ఇంటికి వచ్చిన ఆమె ఈ రెండో వారంలో ఫలితాలు వెలువడుతాయని తెలియగానే ఆందోళనకు గురైంది. ఉత్తీర్ణత సాధిస్తానో? లేదో? అనే మానసిక సంఘర్షణకు లోనై డిప్రెషన్‌లోకి వెళ్లింది. ఈ క్రమంలో గురువారం ఉదయం తల్లిదండ్రులు పనిపై బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న గౌతమి... తన తల్లి చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులు విషయాన్ని గుర్తించి బోరున విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ నాయకుడి దాడి



గాయపడిన జయరామ్

ఉరవకొండ: మండలంలోని చిన్నముష్టూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కొట్టం జయరాములుపై టీడీపీ నేత కొడవలితో దాడి చేశాడు. బాధితుడు తెలిపిన మేరకు.. కొంతకాలంగా జయరామ్ దంపతుల మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో తరచూ వారు గొడవపడేవారు. ఈ క్రమంలో జయరామ్ భార్య తరపు బంధువులు గురువారం ఫోన్ చేసి మాట్లాడాలని నెరిమెట్ల – గాజుల మల్లాపురం గ్రామాల మధ్య ఉన్న పొలం వద్దకు పిలిపించుకున్నారు. ఆ సమయంలో బంధువులు చర్చి సుంకన్న, చిన్న తిప్పన్న మాట్లాడుతుండగా టీడీపీ నేత ఉండబండ పెద్ద తిప్పన్న మాటలతో రెచ్చగొడుతూ సమస్యను మరింత జఠిలం చేశాడు. నచ్చచెప్పబోయిన కొట్టం జయరాములుపై అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న వేట కొడవలితో పెద్ద తిప్పన్న దాడి చేయడంతో తలకు బలమైన గాయమైంది. వారి బారి నుంచి తప్పించుకుని పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న జయరాములును వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తీసుకెళ్లి చికిత్స చేయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ జనార్దననాయుడు విచారణ చేపట్టారు.

అందరి సహకారంతో ‘పది’ పరీక్షలు ప్రశాంతం

- జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు అందరి సహకారంతో ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ... ఈ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. ఏ చిన్న ఘటనా తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామన్నారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు సైతం విధుల్లో పాల్గొన్నారన్నారు. కలెక్టర్‌తో పాటు పరీక్షల నిర్వహణలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి: స్థానిక యల్లనూరు మార్గంలోని రైల్వే లెవల్ క్రాసింగ్ సమీపంలో రైలు కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ నాగప్ప గురువారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. సుమారు 30 సంవత్సరాల వయస్సు ఉంటుంది. బుధవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత చెన్నై నుంచి ముంబయికి వెళుతున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యక్తి మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే తాడిపత్రి రైల్వే పోలీసులను సంప్రదించాలని జీఆర్పీ ఎస్ఐ నాగప్ప కోరారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

క్లుప్తంగా

'సెయింట్ అగస్టీన్'లో గ్రాడ్యుయేషన్ డే

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక సెయింట్ అగస్టీన్ స్కూల్‌లో గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ ఆత్మారాం, కరస్పాండెంట్ మేరీ, ప్రధానోపాధ్యాయురాలు సుజాత, టీచర్లు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



అలంకరణలో శ్రీవల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వరుడి విగ్రహాలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం షష్టి సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. తొలుత సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరుడు, శ్రీవల్లి, దేవసేన ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం వివిధ రకాలతో పూలతో పూజలు చేపట్టారు. వేదపండితుల మంత్రాల నడుమ సుబ్రహ్మణ్యేశ్వరుడికి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

6న సీతారాముల కల్యాణం



ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న ధర్మకర్తలు

అనంతపురం కల్చరల్: శ్రీనివాసనగర్‌లోని సీతారామాంజనేయ దేవస్థానంలో ఈనెల 6వ తేదీన సీతారాములకు కల్యాణం జరిపిస్తామని ఆలయ ధర్మకర్త రాము తెలిపారు. గురువారం ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవ ఆహ్వానపత్రికలను విడుదల చేశారు. సుప్రభాత సేవలు, అభిషేకాలు, అర్చనల అనంతరం మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామ్మూర్తి, ప్రసాద్, ముఖేష్, శివ, ప్రకేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజారామ్‌కు రామసుబ్బయ్య పురస్కారం



అనంతపురం కల్చరల్: శ్రీమక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ విజయవాడ వారి సాహితీ పురస్కారానికి నగరానికి చెందిన సీనియర్ కవి, విమర్శకుడు రాజారామ్‌ను ఎంపిక చేశారు. రాజారామ్ రాసిన విమర్శల వ్యాసాల సంపుటి 'పూలమీద వాలిన తేనెటీగ' ఉత్తమ గ్రంథంగా ఎంపికైంది. త్వరలో ఆయనకు పురస్కారం, రూ.7 వేల నగదు బహుమతి అందిస్తామన్నారు. రాజారామ్ మక్కెన సాహిత్య పురస్కారానికి ఎంపిక కావడంతో ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ, తరిమెల అమరనాథరెడ్డి, చం.శాస్త్రి తదితరులు అభినందనలు తెలిపారు.

కిమ్స్-సవీరలో అరుదైన చికిత్స

అనంతపురం మెడికల్: కిమ్స్-సవీర ఆస్పత్రిలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ మూడే సందీప్ అరుదైన చికిత్స చేసి, రోగికి ప్రాణం పోశారు. అందుకు సంబంధించిన వివరాలను కిమ్స్-సవీర వైద్యులు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. హిందూపురానికి చెందిన ఓ 75 ఏళ్ల వృద్ధుడికి ప్రొస్టేట్ బాగా పెరిగింది. దీంతో పాటుగా రక్తపోటు, మధుమేహంతో బాధపడుతున్నాడు. డాక్టర్ సందీప్ అత్యాధునిక పరిజ్ఞానంతో ప్రొస్టేటిక్ ఆర్టెరీ ఎంబొలైజేషన్ (పీఏఈ) అనే చికిత్సతో నయం చేసేలా చర్యలు తీసుకున్నారు.

ఐఎన్‌టీఎస్ఓ ఫలితాల్లో సత్తా



విద్యార్థులతో ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఐఎన్‌టీఎస్ఓ పరీక్ష ఫలితాల్లో స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి చేతులమీదుగా విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. నాలుగో తరగతి విద్యార్థిని ఆద్రికరాయ్ మొదటి స్థానంలో నిలిచి ల్యాప్‌టాప్ సాధించింది. 197 మంది గోల్డ్ మెడల్స్, 66 మంది కన్సొలేషన్, మెరిట్ సర్టిఫికెట్స్, ఆరుగురు ప్రత్యేక బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ తబుస్సుమ్ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ గోపాల్, అకడమిక్ కో–ఆర్డినేటర్ ఇర్షాద్, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, ప్రైమరీ ఇన్‌చార్జ్ భారతి పాల్గొన్నారు.



నగరంలో కురుస్తున్న వర్షం



రాంనగర్ రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన మురుగు

నగరంలో జోరువాన

నగరంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఆకాశంలో మేఘాలు కమ్ముకోవడంతో ఈదురు గాలులు వీచాయి. ఉరుములు, మెరుపులతో ప్రారంభమైన వర్షం దాదాపు గంటన్నర సేపు కురిసింది. పలుచోట్ల మురుగు రోడ్లపై ప్రవహించింది. ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం నెలకొంది. వాహనదారులు వర్షంలోనే ప్రయాణించారు. పలుచోట్ల హోర్డింగ్స్ దెబ్బతిన్నాయి. కుండపోత వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. చల్లని గాలులను ప్రజలు ఆస్వాదించారు. వేసవిలో ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలకు ఉపశమనం లభించింది.



వర్షంలోనే వెళ్తున్న మహిళలు



ఈదురు గాలులకు పడిపోయిన ఫ్లెక్సీలు

తప్పిన పెను ప్రమాదం

- నాలుగో అంతస్తు నుంచి కిందకు పడిన 60 అడుగుల గోడ
- పాపంపేటలోని జుడియో షోరూం బిల్డింగ్‌లో ఘటన
- భయాందోళనకు గురైన స్థానికులు



రోడ్డుపై పడిన సిమెంటు పెళ్లలు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో కొత్తగా నిర్మిస్తున్న భవనం నాల్గో అంతస్తు నుంచి గురువారం గోడ కూలి మొత్తం రోడ్డుపై పడింది. అదృష్టవశాత్తూ ఈ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. లేదంటే ఘోరం జరిగి ఉండేది. సాయంత్రం సమయంలో వర్షం కురుస్తుండగా.. పెద్ద ఎత్తున గాలులు వీచాయి. ఈ సమయంలో పాపంపేటలో నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి గోడ కుప్పకూలింది. ఇదే భవనంలోనే ఇటీవల జుడియో షోరూం ప్రారంభించారు. 9 అడుగుల ఎత్తుతో సుమారు అడుగుల మేరకు కట్టిన గోడ మొత్తం కూలిపోయింది. ఘటనా స్థలం చూసి స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేశారు. నిత్యం ఈ దారిగుండా విద్యారణ్య నగర్, జాకీర్ కొట్టాలు, కక్కలపల్లి కాలనీ, నందమూరి నగర్ తదితర ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. సాయంత్రమైతే గోడ కూలిన ప్రాంతంలోనే కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు. పదుల సంఖ్యలో ఇక్కడే నిలబడి పిచ్చాపాటిగా మాట్లాడుకుంటుంటారు. అదృష్టవశాత్తూ వర్షం రావడం, పెద్ద ఎత్తున గాలి వీయడంతో ఈ ప్రాంతంలో ఎవరూ నిలబడలేదు. రాకపోకలు సాగించలేదు. లేదంటే ప్రాణనష్టం ఊహించలేమని ఆందోళన వ్యక్తం చేశారు. గోడ పడిన తాకిడికి కరెంటు స్తంభం విరిగిపోయింది. తీగలు తెగిపడ్డాయి. సిమెంటు పెళ్లలన్నీ రోడ్డుపై పడ్డాయి. నిర్మాణ సమయంలో సరైన భద్రతా చర్యలు తీసుకోలేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణాలు చేపట్టే భవనాలకు కనీస భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాలని కోరుతున్నారు.

బోధనాస్పత్రిని అగ్రస్థానంలో నిలుపుదాం



వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షంషాద్‌బేగంను సన్మానించిన ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు

అనంతపురం మెడికల్: అనంతపురం బోధనాస్పత్రిని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుపుదాం. ఆ దిశగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్య రావు పిలుపునిచ్చారు. గురువారం ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించారు. ముగ్గురు రోగులకు సంబంధించి వ్యాధి, వారికందించిన వైద్యంపై కూలంకశంగా చర్చించారు. ఇంకా మెరుగైన వైద్యం అందించింటే ఆ రోగులు బతికేవారా? అలాగైతే ఇంకా ఎటువంటి ప్రమాణాలు పాటించాలో దానిపై చర్చించారు. అదేవిధంగా పోస్టు గ్రాడ్యుయేషన్స్ నుంచి ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. వైద్యులు సమయపాలన పాటించాలని సూచించారు. అలా పాటించని వారికి క్యాజువల్ లీవ్స్‌లో కోత పెడుతామని హెచ్చరించారు. అనంతరం ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ నవీన్‌కుమార్, ప్రొఫెసర్లు డాక్టర్ రామస్వామి నాయక్, డాక్టర్ శివశంకర్ నాయక్, డాక్టర్ ఆత్మరాం, తదితరులను సన్మానించారు.

విద్యార్థులంటే అంత చులకనా?



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో పీజీ చదువుతున్న విద్యార్థులను చులకనగా చూడటం తగదని వైఎస్సార్ విద్యార్థి విభాగం, ఏఐఎస్ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. గురువారం ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు తమ గదుల్లో నుంచి మెస్ హాల్‌లోకి తమ ప్లేట్లు తీసుకెళ్తున్నారు. కనీసం వారికి భోజనం ప్లేట్లు సైతం ఏర్పాటు చేయలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారని మండిపడ్డారు. కనీసం ఐదో తరగతి పిల్లలకు కూడా ఈ పరిస్థితి ఉండదన్నారు. పలు దఫాలు విన్నవించినా.. అధికారులు స్పందించడం లేదని తెలిపారు. అదే విధంగా ఆయా విభాగాల్లో కనీసం తాగునీటి సౌకర్యం లేదని పేర్కొన్నారు. మరుగుదొడ్లు శుభ్రం చేసే సిబ్బంది సైతం లేరని గుర్తు చేశారు. జన్మభూమి క్యాంటీన్, షాపింగ్ కాంప్లెక్స్ టెండర్ల గడువు పూర్తియినప్పటికీ ఖాళీ చేయలేదని చెప్పారు. 40 రోజులు అయినప్పటికీ వారిని ఖాళీ చేయించలేని నిస్సహాయ స్థితిలో అధికారులు ఉన్నారని మండిపడ్డారు. రీటెండర్లు ఆహ్వానించడంలోనూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకుడు హేమంత్ కుమార్,. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రమణయ్య, జగదీష్, శ్రీను నాయక్, సాయి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పీఆర్ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు

అనంతపురం సిటీ: ఏపీ పంచాయతీరాజ్ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ అదనపు సమావేశ భవన్‌లో శనివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.తిప్పేస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్ గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తాలూకా యూనిట్లకు ఎన్నికలు పూర్తయినందున జిల్లా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర శాఖ ఆదేశించిందని అందులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితాను రాష్ట్ర సంఘం విడుదల చేసిందని వివరించారు. జిల్లా స్థాయి ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర అధ్యక్షుడు రత్నకుమార్, ఎన్నికల పరిశీలకుడిగా రాజేశ్ ప్రభుకుమార్ హాజరు కానున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయి ఎన్నికల్లో తాలూకా స్థాయి అధ్యక్షులు, అసోసియేట్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, కో–ఆప్షన్ సభ్యులు హాజరై తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

మద్దెలచెరువు ఎద్దులకు అంతర్రాష్ట్ర బహుమతి

కనగానపల్లి: మండలంలోని మద్దెలచెరువు గ్రామానికి చెందిన ఎద్దులు అంతర్రాష్ట్ర ఎద్దుల బండి పరుగు పోటీల్లో బహుమతి సాధించాయి. కర్ణాటక రాష్ట్రం చెళ్లికెరలో బుధ, గురువారాల్లో అంతరాష్ట్ర ఎద్దుల బండి పరుగు పోటీలు నిర్వహించారు. ఇందులో మద్దెలచెరువు గ్రామానికి చెందిన రైతు కురాకులపల్లి అంజినప్పకు చెందిన ఎద్దులు పాల్గొన్నాయని స్థానికులు తెలిపారు. ఈ పోటీల్లో బాగా రాణించిన ఆ ఎద్దులు రెండవ స్థానంలో నిలిచాయని తెలిపారు. రైతు అంజినప్పకు నగదు బహుమతి, సిల్వర్ మెడల్ అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు, గ్రామస్తులు ఆ ఎద్దులను గ్రామంలో ఊరేగించారు.

కేంద్ర ప్రభుత్వంపై పెన్షనర్ల ఆగ్రహం



బీఎస్ఎన్ఎల్ జీఎం షేక్ ముజీబ్‌పాషాకు వినతిపత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

అనంతపురం సిటీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ, రాజ్యసభల్లో ఆమెదించిన క్రూరమైన ఆర్థిక బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. అనంతపురంలోని రైల్వే శాఖకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు తమ శాఖ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. తపాలా, బీఎస్ఎన్ఎల్ శాఖలకు చెందిని రైటర్డ్ ఉద్యోగులు కూడా ఆందోళన కొనసాగించారు. గడచిన 25, 27 తేదీల్లో పైన పేర్కొన్న రెండు సభల్లో ఆమోదించిన ఆర్థిక బిల్లుల సవరణల కారణంగా తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ఆయా శాఖల యూనియన్ల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎనిమిదో పే కమిషన్ (సీపీసీ) ముందు రిటైర్డ్ అయిన పెన్షనర్లు తమ పెన్షన్ పునరుద్ధరణ హక్కును కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో పెన్షన్ అప్‌డేట్ అయ్యే అవకాశమే ఉండదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త నిబంధనల ప్రకారం పెన్షన్ సవరణలు భవిష్యత్‌నుంచి మాత్రమే అమలవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంటే ఇప్పటికే రిటైర్డ్ అయిన వారికి ఎలాంటి ప్రయోజనం ఉండదని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే దశల వారీగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ షేక్ ముజీప్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఆయా శాఖలకు చెందిన అన్ని యూనియన్ల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అనంతపురం కార్పొరేషన్: అకాల వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలో ఉరుములతో కూడిన భీకర వర్షం కురిసిన విషయం విదితమే. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విషయం తెలుసుకున్న మేయర్ వసీం సంబంధిత అధికారులతో మాట్లాడారు. ముందస్తు చర్యలు చేపట్టాలని కమిషనర్ బాలస్వామిని ఆదేశించారు. అదేవిధంగా నగరంలో నూతనంగా నిర్మిస్తున్న బహుళ అంతస్థుల గోడ కూలింది. విషయం తెలుసుకున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి కూలిన గోడను పరిశీలించారు. గోడ కూలడంతో నాలుగు బైక్‌లు ధ్వంసమయ్యాయి. అదేవిధంగా నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్, పారిశుధ్య అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని సంబంధిత అధికారులను హెచ్చరించారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండల పరిధిలోని వివిధ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. షెడ్యూలు మేరకు కేటాయించిన ఆయా తేదీల్లో సచివాలయాలకు వెళ్లి ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేయించుకోవాలని సూచించారు. నేడు, రేపు ఎ.నారాయణపురం-1, 2, 4, రాజీవ్‌కాలనీ-1 సచివాలయాల్లో క్యాంపులు ఉంటాయని తెలిపారు. ఈనెల 8న ఎ.నారాయణపురం-3, 5, రాచానపల్లి, రాజీవ్‌కాలనీ-2 సచివాలయాలు, 9న ఎ.నారాయణపురం-3, 5, రాచానపల్లి, రాజీవ్‌కాలనీ-2 సచివాలయాలు, 10న ఎ.నారాయణపురం-3, 5, రాచానపల్లి, రాజీవ్‌కాలనీ-2 సచివాలయాలు, 11న ఎ.నారాయణపురం-1, 2, 4, రాజీవ్‌కాలనీ-1 ఆధార్ క్యాంపులు ఉంటాయని వెల్లడించారు.

సమర్థ నిర్వహణతోనే జల సంరక్షణ

అనంతపురం: సమస్త జీవజాలం మనుగడకు నీరు అత్యావశ్యకం. జల వనరుల సంరక్షణకు తక్షణ చర్యలు అనివార్యమని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ అనంతపురం లోకల్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. అంతర్జాతీయ నీటి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విశిష్ట అతిథిగా డాక్టర్ సుధాకర్ రెడ్డి (ఈసీఈ విభాగాధిపతి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురం) హాజరై నీటి సంరక్షణ విధానాలను వివరించారు. కార్యక్రమంలో అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలు తీసిన వారిపై చర్యలు తీసుకోండి

అనంతపురం టవర్‌క్లాక్: రాయదుర్గంలో పురాతన దేవాలయంలో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా విగ్రహాలు తీసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయదుర్గంలో 400 సంవత్సరాల క్రితం వెంకటేశ్వర దేవాలయం నిర్మించారన్నారు. ఆ దేవాలయంలో విగ్రహాలు కదులుతున్నాయని కారణంతో కూటమి నాయకులు ఎటువంటి అనుమతులు తీసుకోకుండా విగ్రహాలు తీసినట్లు ఆరోపించారు. పూర్వీకులు విగ్రహాలు ఏర్పాటు చేసిన సమయంలో బంగారు, వజ్రాలు వంటివి విగ్రహాల కింద పెట్టి ప్రతిష్ట చేస్తారన్నారు. వాటికి ఆశపడి దేవాలయ చైర్మన్ పదవి రాకపోయినా దౌర్జన్యంగా విగ్రహాలు తీశారన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, శ్రీరాములు, కుళ్లయప్ప తదితరులు పాల్గొన్నారు.

'హరిజన హాస్టల్ భూమిని కబ్జా చేస్తున్నారు'



కలెక్టర్ వినోద్‌కుమార్ వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: ఉరవకొండ పొలం సర్వే నంబర్ 533/బీ1లో (1.65 ఎకరాలు) ఉన్న శ్రీగాంధీ హరిజన హాస్టల్ భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని ఎస్సీ సంఘాల నాయకులు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్ వద్ద కలెక్టర్ వి.వినోద్ కుమార్‌ను కలసి, వినతిపత్రం అందజేశారు. ఎస్సీ సంఘాల నాయకులు హరి, యల్లన్న, గుంద్రాయప్ప మాట్లాడుతూ.. పట్టా భూమిని 1941లో శ్రీగాంధీ హరిజన వసతి గృహం కోసం దానం ఇచ్చారన్నారు. అయితే ఖాతా నంబర్ అడంగల్‌లో తొలగించారని చెప్పారు. ప్రస్తుతం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని కొందరు కబ్జా చేశారని చెప్పారు. హాస్టల్ భూమి పట్టా భూమి అయినందున ఆన్‌లైన్‌లో వసతిగృహం పేరుతో నమోదు చేయాలని కోరారు. స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనందరాజు, ఎర్రిస్వామి, వన్నూరప్ప, రామాంజనేయులు, వెంకటేష్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు



ఈదురు గాలులకు ఆత్మకూరు మసీదు వీధిలో విద్యుత్ వైర్లు తెగిపడిన దృశ్యం

ఆత్మకూరు: మండలంలో పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గాలి ఎక్కువగా రావడంతో ఆత్మకూరులోని మసీదు వీధిలో విద్యుత్ వైర్లు తెగి కిందపడ్డాయి. ఆ సమయంలో విద్యుత్ ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వైర్లు కింద పడిన సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో విద్యుత్ అధికారులు స్పందించారు. విద్యుత్ సరఫరాను బంద్ చేయించి వైర్లను తొలగించారు. మండలంలో తలుపూరు, వడ్డుపల్లి, బి.యాలేరు గ్రామాల్లో వర్షం కురిసింది.

కానిస్టేబుళ్ల బదిలీ ప్రక్రియ పూర్తి

అనంతపురం: రెండు రోజులుగా కొనసాగుతున్న కానిస్టేబుళ్ల బదిలీ ప్రక్రియ పూర్తయ్యింది. సీనియార్టీ ఆధారంగా జిల్లా వ్యాప్తంగా 89 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేయగా.. గురువారం ఆయా పోలీస్‌స్టేషన్లలో రిపోర్ట్ చేసుకున్నారు.

కొనసాగుతున్న వసంత నవరాత్రి మహోత్సవాలు



అలంకరణలో అనంతేశ్వరి దేవత

అనంతపురం కల్చరల్: నగరంలోని శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరి వసంత నవరాత్రి మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. గురువారం సాయంత్రం మహిళా మండలి ఆధ్వర్యంలో సామూహిక శ్రీమణిదీప వర్ణన, పారాయణం తొమ్మిది పర్యాయాలు చేశారు. అమ్మవారి నామస్మరణతో మార్మోగించారు. అలాగే శ్రీదేవి ఖడ్గమాల స్తోత్రం పారాయణం అనంతరం ఆశ్రమంలో కొలువుదీరిన వివిధ దేవతలకు అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ఆశ్రమ ప్రతినిధులు అరవింద్, రత్నగిరి దేవరాజ్ మాట్లాడుతూ.. మరో నాలుగు రోజుల పాటూ ఆశ్రమంలో ఆధ్యాత్మిక సేవా పరంపర కొనసాగుతుందన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామనాథం

అనంతపురం మెడికల్: దోమకాటు వ్యాధి నివారణ చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామనాథం పేర్కొన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ విభాగాల అధికారుల సహాయ సహకారాలతో గ్రామాల్లో పర్యటించి ఆరోగ్యశాఖ సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుని ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వంగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దోమల నివారణలో భాగంగా మలేరియా సిబ్బందితో తరచూ స్ప్రేయింగ్ చేయించాలన్నారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు, తదితరులు పాల్గొన్నారు.